# 'పాలమూరు కూలీ'

నేను ఇల్లు కట్టుకుంటున్న ప్రాంతం వూరి చివర. నంద్యాల చెక్‌పోస్టు దగ్గర... ఇప్పుడిప్పుడే అక్కడ ఇళ్లు పడుతున్నాయి.

ఆ ఇళ్ల పనికి కూలీలు కావాలి కదా... ఇప్పుడు ఆ ప్రాంతంలో కూలీల అవసరం చాలా వుంది.

మామూలుగా మా కర్నూల్లో మట్టిపనికి కూలీలు కావాలంటే రైల్వేస్టేషన్ల దగ్గర అయిదు రోడ్ల జంక్షన్‌కు ఉదయాన్నే వెళ్తేచాలు. బారులు దీరి కూలీలు కూచుని వుంటారు. వాళ్లందరూ మొలకసీమ కూలీలే దాదాపు వాళ్లలో చాలామందికి పొలాలు కూడా ఉంటాయి.

మొలకసీమ అంటే అత్యంత క్షామపీడిత ప్రాంతంగా పేరున్న మహబూబ్‌నగర్. కరవుతో పొలాలు పండక... ఎండిన కడుపుల్తో పిల్లల్నీ ముసలివాళ్లన్నీ వుంచలేక చుట్టుపక్కల జిల్లాలకు కూలీలుగా వలస వెళ్లిపోతారా ప్రాంతంవాళ్లు. నేనిప్పుడు ఇల్లు కడుతున్న ప్రాంతం వూరిచివర కాబట్టి అక్కడింకా ఖాళీస్థలాలు చాలా వున్నాయి.

ఆ ఖాళీ స్థలాల్లో అక్కడక్కడా ప్లాస్టిక్ షీట్లూ, చింకి గోనెలూలాంటి వాటితో పాకల్లాంటి గూళ్లు వేసుకుని ఈ కూలీలు నలభై ఏభై మంది తాత్కాలికంగా వుంటున్నారు.

వాళ్లున్న స్థలం యజమాని వచ్చి లేపితే  గూళ్లు తెంచుకుని వెళ్లాల్సిందే వాళ్లు. నేనా పాకల పక్కనించీ రోజూ వస్తూ పోతూ వుంటాను.

పౌష్టికాహార లోపంతో డొక్కలెండి, పుసులోడుతున్న కళ్లతో, వంటిమీద బట్టలు లేక వాళ్ల పిల్లలు ఆ ఎండలో దుమ్ములో ఏడుస్తూ, ఆడుకుంటూ అక్కడే మలమూత్రాలు విసర్జిస్తూ నిర్దాక్షిణ్యంగా నన్ను హింసిస్తూ కనబడతారు.

ఈ మధ్య టీవీలో జాన్సన్స్ బేబీ ప్రొడక్ట్స్ అడ్వర్టైజ్మెంట్ కనిపించినప్పుడల్లా ఈ పిల్లలు నా కళ్లముందు కనబడి మనసును కకావికలం చేస్తున్నారు.

ఎందుకు సమాజంలో ఈ తేడా? ఈ వ్యత్యాసం? అని ప్రశ్నించుకోడం. పోనీ నేను ఏమన్నా చేద్దామా అంటే మహా అయితే ఓ రెండుపూటలు భోజనం పెట్టగలను నేను టాటాకో బిర్లాకో వారసుణ్ణి కాదు కదా! గత పాతికరోజులుగా ఈ ఆలోచన నన్ను చాలా ఇబ్బందికి గురిచేస్తోంది. దీనికి పరిష్కారం రాజకీయ పరిష్కారమే అన్నది ఖచ్చితంగా తెలుసు. మన రాజకీయ నాయకులకి వీళ్లందరూ మనుషులు కారు ఓట్లు.

సరే మొన్న గురవారం పైన కాలమ్స్‌కు కడ్డీలు కడుతూంటే చూస్తూ ఉన్నాను. మా ఆర్పీడీ వచ్చాడు. "ఏమన్నా ఇల్లు ఎంతవరకూ వచ్చింది?" అంటూ (వాణ్ణి ఆర్పీడీ అంటాన్కారణం మాకు ప్రసాదు లెక్కువై ఎ.ప్రసాదు, సి.ప్రసాదు, ఆర్.ప్రసాదు అని పిలుచుకుంటాం. ఆ ఆర్.ప్రసాదే మా ఆర్.పి.డి) సరే ఇంటి గురించి కాసేపు మాట్లాడిన తర్వాత పాలమూరు కూలీల గురించి ప్రస్తావించాను.

"ఇక్కడన్నా మనం కొద్దోగొప్పో మంచి కూలీలే ఇస్తామన్నా, పై రాష్ట్రాలకు వీళ్లని ఎగుమతి చేస్తూ చాలాదాలా హీనమైన ధర కడ్తారన్నా వీళ్లకి" అన్నాడు ఆర్పీడీ. "పై రాష్ట్రాలకేమిటీ వీళ్లని ఎగుమతి చేయడమేమిటి?" అనడిగా. చెప్పుకొచ్చాడు ఆర్పీడీ.

మొన్న యశ్వంతపూర్, బిలాస్‌పూర్ రైలెక్కినానన్నా హైదరాబాద్‌కు పోదానికి. మధ్యలో మహబూబ్‌నగర్‌లో వీళ్లు మందులు మందలు ఎక్కినారు. అంత మందిని ఈ మధ్య ఎప్పుడూ చూళ్లేదు. కుతూహలం పట్టలేక ఒకామె నడిగినాను "ఎక్కడికమ్మా అని. ఆమెకు తెలియదామె ఎక్కడికిపోతోందో 'మా గుత్తెదారు యాడికి పొమ్మంటే అడికి పోతాం' అనిందామె. తర్వాత తెల్సింది వాళ్లని ఛత్తీస్‌ఘడ్ తీసుకు పోతున్నాడు వాళ్ల కాంట్రాక్టరు డీప్ ఫారెస్ట్ లో రోడ్డు వేయదానికి. ఇద్దరు మనుషులకు పద్దెనిమిది వేల రూపాయలు అడ్వాన్స్‌గా యిచ్చేస్తాడు ఆ కాంట్రాక్టర్. తొమ్మిది నెలలు పనిచేయాలి. భోజనం ఫ్రీ. వాడు పెట్టే తిండిలో గొడ్డుకారం వుండి తీరాలంటారీ కూలీలు. కారం ఎక్కువైతే కడుపునిండా నీళ్లు తాగొచ్చుకదా! అంటే మనిషికి తొమ్మిది నెలలకు తొమ్మిదివేలు. రోజుకు ముప్పై మూడు రూపాయల కూలీ. వీళ్లకు లెక్కలు తెలియవు. ఒక్కసారి పద్దెనిమిదివేల రూపాయలు చూసేసి వెర్రానందంతో వాడి వెనక వెళ్లిపోతారు.

వీళ్లింతేనన్నా మన చేతుల్లో ఏమీ లేదు. చూసి బాధపడాల్సిందే అంతే" నాకు మనసంతా పిండేసినట్లైంది... వీళ్లకు పెన్షన్లూ గట్రా వుండవుకదా... చేవ ఉడిగితే ఏం చేస్తారు వీళ్లు? బిడ్డలు చూస్తే సరే... లేకపోతే దేశంలో యింకొందరు బిచ్చగాళ్లు.

పతితులారా భ్రష్టులార
బాధాసర్ప దష్టులార
ఏడవండి ఏడవండి
రావు కదా రావు కదా
ఏ జగన్నాథ రథచక్రాల్... ●